"మీ మాటే ఖాయమైందండీ!" అంది కల్యాణి నవ్వుతూ

"నీ మాటా ఖాయ మైనట్లేగా" అన్నాడు కాము దేడుస్తూ.

సాయంత్రం ఆరు గంటలయినా వర్షం పూర్తిగా తగ్గలేదు 'టీ'కాచింది కల్యాణి. 'వద్దు మొర్రో' అంటున్నా కుముదంచేత కూడా తాగించింది తత్ఫలితంగా కుముదం తెల్లవార్లూ మేలుకున్నుంది

కాముడూ, కల్యాణికూడా ఆ అమ్మాయితో బాటే అయ్యారు.

సూర్యోదయం అయ్యేసరికి టాక్సీ తెచ్చాడు కాముడు కుముదాన్ని తీసుకుని వాళ్ళన్నగారింటి కెళ్తే ఆ యిల్లు తాళం వేసుంది. పక్కవాళ్ళను కనుక్కుంటే "నిన్న మధ్యాన్నం 12 గంటలకు బయల్దేరి తిరుపతెళ్ళారు; ఇవాళ మొక్కుబళ్ళు తీర్చుకుని, రేపంతా కొండమీదే వుండి, ఎల్లుండి పొద్దున్నే వస్తారు" అని చెప్పారు.

కుముదాన్ని తిట్టుకుంటూ మళ్ళీ ఇంటికి చేరాడు.

ఈసారి కల్యాణిమీదే కోపం వచ్చేసింది.

సెలవు దినాలు కాసినీ వృధా అయిపోయాయి కాముడికి. సోమవారం వచ్చింది. పొద్దున్నే కుముదాన్ని వాళ్ళన్న గారింటికి రవాణాచేశాడు. వాళ్ళూ అప్పుడే వచ్చారట! పరస్పర పరిచయాలు వగైరాల అనంతరం కాముడికి కాఫీ టిఫిన్లు ముట్టాయి. "అప్పుడప్పుడూ వస్తూండండి" అన్నారు వాళ్ళు.

"అలాగే" అని బయటపడ్డాడు కాముడు.

దార్లో మరో తన ఆఫీసు గుమాస్తా ఇంటికెళ్ళి "జ్వరం ఇంకా తగ్గలేదు! మరో రెండ్రోజులు సెలవిప్పించండి" అని సెలవు చీటీ రాసిచ్చి, తన వైఫ్ వచ్చిన సమాచారం. కొత్తకాపురం సమాచారం చాలా సర్దాగా ఆ గుమాస్తాకు చెప్పేసరికి "మరో రెండ్రోజులుకూడా సెలవుపెట్టండి కామేశ్వరరావుగారూ" అంటూ బతిమాలాడు గుమాస్తా. "పోన్లే. ఇంత బతిమాలుతున్నప్పుడు మనం కాదంటే ఏం బాగుంటుంద"ని మరో చీటీ రాసిచ్చి "థ్యాంక్స్" చెప్పి వెళ్ళిపోయాడు కాముడు.

తన ఇంట్లో కాలుపెట్టిన కాముడు 'తపీ' మని కొయ్యబారిపోయాడు.

"ఇదేమిట్రా నాన్నా ఇలా చిక్కిపోయావ్! బిడ్డకు సరైన తిండికూడా లేదు గావును! నీ కిష్టమని కొత్తావకాయకూడా తీసుకొచ్చాన్రా నాన్నా! వెధవది.... ఏమిటో మొన్న కల్యాణితో పంపిద్దామనుకుంటూనే మర్చిపోయాను. త్వరగాస్నానం చేసి రా నాన్నా; అన్నం వండిపెడతాను" అంటూ కాముణ్ణి ప్రేమతో నిమిరింది జగదాంబ.


"ఎప్పుడో! ఇంకెప్పుడో" అంటూ ఏడుపుమొఖం పెట్టాడు.

"ఇప్పుడే పెట్టేస్తానురా తండ్రీ! ఒక్క నిమిషం; ఇంక నీకేం భయంలేదు. శుభ్రమైన తిండి తిందువుగాని. అత్తయ్యకూడా కాస్త కులాసాగానే వుందా?....ఇంకిప్పట్లో నే నక్కడకి వెళ్ళనే వెళ్ళను. నీదగ్గరే ఉంటా! ఏడ్వకు! వచ్చేసన్నా"ని" అంటోంది జగదాంబ. చదికిలబడ్డాడు కామేశం — "లాభంలేదు! రెండు గదులున్న ఇల్లు చూడాల్సిందే" అని గొణుగుతూ. తలొంచుకుని నవ్వుకుంటూ బియ్యం ఏరుకుంటోంది కల్యాణి.

□□□








పంచాంగం పేజీలు తిరగవేస్తూ అప్పుడప్పుడు ఆత్రంగా లోనికిచూస్తున్నాడుజగన్నాథం.

"మామయ్యా...."

అంటూ వస్తున్న జ్యోతిని చూసి.

"ఏవమ్మా పురుడు వచ్చిందా" అని ఆత్రంగా అడిగాడు జగన్నాథం.

మామయ్య కంగారు చూసి మనస్సులోనే నవ్వుకుంది జ్యోతి.

తనకు తెలుసు. ఈ ఆత్రుత అంతా దేనికో! మగపిల్లవాడు కలిగాడేమో అని. ఇప్పుడు అసలు విషయం చెబితే!

మామయ్య గుండె ఆగిపోదూ!

"మగపిల్లవాడు కలిగాడు మామయ్యా" అంది నవ్వుతూ. ఆవార్త తనెందుకు చెప్పాలి అనుకుంది జ్యోతి.

"నక్షత్రం చాలా మంచిదమ్మా" అనుకుని మురిసిపోతున్నాడు జగన్నాథం.



"నాన్నా, నాన్నా! నావందెమేనెగ్గింది. చెల్లాయి నావోలికే" అంటూ పరుగెత్తు కుంటూ వచ్చింది ఎనిమిది సంవత్సరాల బాలిక కమల.

జగన్నాథం గుండెల్లో రైళ్ళు పరు గెత్తాయి. జ్యోతికేసి చూశాడు.

"క్షమించు మామయ్యా; అబద్ధం చెప్పాను అడపిల్ల పుట్టింది" అంది జ్యోతి తలవంచుకొని.

జగన్నాథం చేతిలోని పంచాంగం జారి క్రిందపడింది.

"నిన్ను దేనికి క్షమించటం వెర్రితల్లీ! నామీద భగవంతునికే దయలేదు. ఆయన చెలగాటానికి నాబోటి దరిద్రుడే దొరికాడు" అనుకొని నిట్టూర్చాడు జగన్నాథం.

మామయ్య అవస్థచూసి జాలిపడింది జ్యోతి.

"అమ్మా."





పిలిచాడు జగన్నాథం.

దగ్గరకు వెళ్ళింది జ్యోతి.

ఆప్యాయంగా తలనిమిరాడు.

"నేను నీచేత చాకిరీ చేయిస్తున్నానమ్మా. ఒర్పులో భూదేవతవు. నీ ఈడు పిల్లలతో కలసి ఆడుతూ, పాడుతూ స్కూలుకువెళ్ళి చదువుదామనే కోరిక నీకూ ఉంటుంది. కాని; ఈ మామయ్య నీకు యింటిచాకిరీ వప్పచెప్పాడు" అంటూ కళ్ళు తుడుచు కున్నాడు జగన్నాథం.

"ఛా. అదేమిటి మామయ్యా! ఆలా అంటావు? ఎవరింట్లో వాళ్ళు పనిచేసు కోవటం తప్పా ఏమిటి?

స్కూలుకు వెళ్ళకపోతేనేం? బావ నాకు చదువు చెబుతూనే ఉన్నాడుగా. డిగ్రీలు లేవుగాని యింగ్లీషు చక్కగా మాట్లాడగలను. సెలవులలో వచ్చినప్పుడల్లా బావ నాకు చెబుతూనే ఉన్నాడు లెక్కలు. ఇంగ్లీషు. నీ వలా బాధపడకు మామయ్యా" అంది జ్యోతి.

"అల్పసంతోషివమ్మా. భగవంతుడు నిన్ను కాపాడతాడు" అంటూ అప్యాయంగా తల ఁమిరాడు.

● ● ●

ఆ యింట్లో జ్యోతి లేనిదే ఒక్కక్షణం గడవదు జగన్నాథం భార్య సీతమ్మ జబ్బు మఃషి. మధు పెద్దవాడు. తొలిచూలు అబ్బాయి. తరువాత నాల్గు కాన్పులు పోయాయి. తరువాత కమల. కమల తరు వాత ఎనిమిది సంవత్సరాలకు మళ్లా ఇప్పుడు ఆడపిల్ల.

జగన్నాథం బట్టలకొట్టులో గుమాస్తా.

వచ్చే జీతపురాళ్ళు చాలవు. మందులు లేనిదే సీతమ్మ బ్రతకలేదు.

కమల పుట్టినదాకా జగన్నాథం తల్లి బ్రతికే ఉంది

---

## కొమ్మూరు మారుతీదేవి

జగన్నాథం అప్పుల పాలవసాగాడు.

జగన్నాధానికి ఒక చెల్లెలుండేది. ఆమె కూతురే జ్యోతి.

జ్యోతికి చిన్నప్పుడే తల్లితండ్రులు కరువయ్యారు. జ్యోతి తల్లి చనిపోతూ.

జ్యోతిని మధుకిచ్చి పెళ్ళిచేయమని కోరింది.

మూడు తులాల బంగారం. వెయ్యి రూపాయిల రొక్కం యిచ్చింది. జగన్నాథం నిప్పులాంటి మనిషే కాని పరిస్థితుల ప్రభావంవల్ల బంగారం అమ్మివేసి డబ్బు వాడేసుకున్నాడు.

మెళ్ళో నల్లపట్టుత్రాడుతో కట్టిన అంజనేయుని బిళ్ళ తప్ప జ్యోతి వంటిమీద చిన్న మెత్తు బంగారం లేదు. ఆడపిల్లసొమ్ము వాడినందుకు ఎంతో బాధ పడుతూంటాడు జగన్నాథం జ్యోతికేసి చూసినప్పుడల్లా.

జ్యోతి అందమయిన పిల్ల.

బావ మధు అంటే ఆమె కెంతో ప్రేమ. మధుకు కూడా జ్యోతిపై చాలా యిష్టం. ఇంటి చాకిరీతో సతమతమవుతున్న జ్యోతిని చూస్తూంటే అతనికి ఎంతో బాధ కలిగేది.

మధు పట్నంలో యింజనీరు చదువుతున్నాడు. రెండు సంవత్సరాలు ఎలాగో పూర్తిఅయినాయి. మధును యింజనీరు చదివించడానికి మొదట్లో జగన్నాథం ఒప్పుకోలేదు.

"ఇప్పటికే అప్పులు తెస్తున్నాను. నేను పెద్దచదువులు చెప్పించలేను" అని మొర పెట్టుకున్నాడు జగన్నాథం. మధు ఉత్సాహం. జ్యోతి పట్టుదల. యజమాని రమణయ్య ప్రోత్సాహం-ఎలాగయితేనేం? అప్పుచేస్తూ చదువు చెప్పిస్తున్నాడు జగన్నాథం. డబ్బు అవసరం వచ్చినప్పుడల్లా తన యజమాని వద్దకేవెళ్ళి అప్పు తెచ్చుకునేవాడు జగన్నాథం. అడగ్గానే అప్పు యిస్తున్నందుకు రమణయ్యంటే ఎంతో గౌరవ మేర్పడింది జగన్నాధానికి.

దేవుడే నాకు రమణయ్యను చూపాడేమో అనుకునేవాడు. ఇంకొక్క మూడు సంవత్సరాలు ఓపికపడితే కొడుకే సంసారాన్ని ఆదుకుంటాడని తృప్తిచెందేవాడు.

సీతమ్మ ఆదొకమోస్తరు మనిషి ఆమె కెప్పుడూ రోగాలు, మందులు. మందులేనిదే రోజు గడవదు. ఇంట్లో అంత పనీ చేస్తున్నా జ్యోతిని కసురుకుంటూనే ఉండేది.

పోయిన ఏడాది సెలవలకు వచ్చినప్పుడు మధు బాగా మారిపోయాడు అతనికి ధనకాంక్ష పట్టుకుంది. తన స్నేహితులు ఖరీదైన బట్టలు ధరిస్తారని, తనకు కనీసం ఒక్క జతఅయినా లేదని, పదివేలు, ఎనిమిదివేలు కట్నం తీసుకుని వివాహాలు చేసుకుంటున్నారని అన్నాడు మధు.

జ్యోతి మనస్సు తల్లడిల్లింది. బావకూడా కట్నానికి ఆశపడి యింకొకపిల్లను వివాహం చేసుకోడుగదా? తనను వివాహమాడితే అప్పులు అప్పచెబుతుంది. తనతో ఈసారి అతను అంత చనువుగా మాట్లాడలేదు

మనసారా ప్రేమించిన బావ మరొకర్ని వివాహంచేసుకుంటుంటే తను చూడగలదా? భగవంతుడా ఏమిచేయదలచావు అంటూ వాపోయింది.

సీతమ్మకు పురుడు వచ్చాక బలహీనత ప్రారంభించింది.

నెత్తురులేక మనిషి తెల్లబడింది.

డాక్టరు పరీక్షించి, టి. బి. అని తేల్చేడు.

మందులు, యింజక్షన్లు వ్రాసియిస్తూ,

"ఇవి త్వరగా వాడాలి, ఆలస్యంచేస్తే ప్రమాదం. పళ్ళు కోడిగ్రుడ్లు బాగా తీసుకోవాలి" అన్నాడు.

జగన్నాధం గుండె గుభేలుమన్నది.

'గోరుచుట్టుపై రోకలిపోటా! అప్పు తెస్తున్నాను కాని ఒక్కపైసకూడా తీర్చలేకపోతున్నా భగవంతుడా! ఎంత అగ్నిపరీక్ష పెట్టావయ్యా? ఇప్పుడు కనీసం ఆరువందలైనా కావాలి. వడ్డీతో కలుపుకుని యిప్పటికి నాల్గువేలు అప్పుంది. యజమాని మంచివాడు కనుక అడిగినప్పుడల్లా తనకు సొమ్ము యిస్తున్నాడు. లేకపోతే తనకు ఆ అప్పుకూడా ముట్టదు.' అనుకొని బాధపడుతున్నాడు జగన్నాధం. చివరకు ఏమయితే అది అవుతుందని రమణయ్య వద్దకు వెళ్ళాడు.

"కూర్చోండి జగన్నాధంగారూ" అంటూ కుర్చీ చూపించాడు రమణయ్య.

"బాబూ! ఇప్పటికే మీ కెంతో ఋణపడివున్నాను. కనికరించండి బాబూ! పిల్లలు గలవాడిని. మా యింటిదానికి జబ్బుగా ఉంది బాబూ! డాక్టరు పరీక్షించి టి. బి. అన్నాడు. సిగ్గువిడిచి అడుగుతున్నా. ఒక్క ఆరువందలు యిప్పించండి" అంటూ ప్రార్థించాడు జగన్నాధం.

"ఇప్పుడు మీకు డబ్బు అవసరం అంటారు. అంతేనా?" తాపీగా ప్రశ్నించాడు చుట్ట పొగ వదులుతూ రమణయ్య.

జగన్నాథం ఏమీ మాట్లాడలేదు.

"నే నొక సలహా చెబుతా వింటారా?" అన్నాడు రమణయ్య.

"చెప్పండి బాబూ" అన్నాడు ఆశతో జగన్నాధం.

"మీ అబ్బాయి మధుకు వివాహం చేసెయ్యండి" అన్నాడు నవ్వుతూ రమణయ్య.

"నేనే సంసారం ఈదలేక చస్తూఉంటే యింకా సంపాదనలేనివాడు వివాహం చేసుకుని ఏం సుఖపడ్తాడు బాబూ" అన్నాడు జగన్నాధం.

"మీరెంత అమాయకులండీ జగన్నాధంగారూ! యోగ్యుడు, తెలివయిన కుర్రవాడు, మీ మధుకు, మా జానకినిచ్చి పెళ్ళిచేస్తా. మీకు అంగీకారమేనా?

దాని తల్లిపోయినప్పట్నుంచి అల్లారుముద్దుగా పెంచుతున్నాను. సవతితల్లి బాధలు పెడుతుందేమోనని తిరిగి నేను వివాహం కూడా చేసుకోలేదు. మీకు తెలియనిదేముంది? స్కూలుఫైనలు ప్యాసయింది. పదివేలుకట్నమిస్తాను. పిల్లపేర అయిదెకరాల పొలం వ్రాసి యిస్తాను. వంటిమీద అయిదారు వేలు ఖరీదుగల బంగారం ఉంది. మీకు డబ్బు అవసరం. మీరు నా బాకీ కూడా తీర్చనక్కరలేదు." అన్నాడు రమణయ్య.

---

నూజివీడు స్టేషనులోదిగిన ఆసామి :

"ఇక్కడికి నూజివీడు ఎంతదూరం?"

"పదమూడు మైళ్ళు."

"అబ్బో. స్టేషను ఇంతదూరంలో ఎందుకు కట్టారో?

"పట్టాలకి దగ్గిరగా వుంటుందని."

జగన్నాథానికి భూమికంపించినట్లయింది.

"బాబూ, మా మేనకోడలు జ్యోతి, మధు అన్యోన్యంగా ఉంటారు. ఆ అమాయకురాలు వాడిని నమ్ముకొంది. వారిద్దరి ప్రేమను నాశనం చేయలేను. అయినా, నా చెల్లెలికి చనిపోతున్నప్పుడు మాట యిచ్చాను జ్యోతిని మధుకిచ్చి వివాహం చేస్తానని" అన్నాడు భయంగా జగన్నాధం.

"మీరు యింకా పాతరోజుల్లో ఉన్నారు జగన్నాధంగారూ! అయినా ఆలోచించండి. జ్యోతి నాకు తెలుసు. మంచిపిల్ల. ఆ అమ్మాయి వివాహానికి రెండువేలు యిస్తా. ఇంకో సంబంధం చూసిపెళ్ళిచేయండి.

అల్లా వీల్లేదు అంటారా, మీ ఉద్యోగానికి నీళ్ళువదులుకుని, నా బాకీ తీర్చండి" అన్నాడు ఖచ్చితంగా రమణయ్య.

జగన్నాధానికి ఏమీ తోచలేదు. బావే తన భర్త అని ఆశలుపెట్టుకున్న జ్యోతిని విచారసముద్రంలో ముంచివేయనా? ఆమె ఆశ నిరాశ చేయనా? ఆడపిల్ల సొమ్ము కూడా తిన్న పాతకుణ్ణి దేవుడా? అసలు నీవు ఉన్నావా? ఉంటే నాకు చావు ఎందుకు రాసిపెట్టలేదు? నన్నిప్పుడే చంపు. చిత్రవధ చేయకు. రమణయ్య చెప్పినట్లు వప్పుకోకపోతే తను సర్వనాశనం కాక తప్పదు అనుకొంటూ లేచాడు జగన్నాధం

"మరి నాకు ఏసంగతి ఆలోచించి రేపు చెబుతానుగదూ? నెమ్మదిగా ఆలోచించండి తొందరలేదు" అన్నాడు రమణయ్య.

● ● ●

తలను చేతితో పట్టుకుని ఉస్సూరుమంటూ కూలబడిన జగన్నాధాన్ని చూసి అప్పుపుట్ట లేదనుకుంది సీతమ్మ.

"ఏమండీ? రమణయ్య ఏమన్నాడు?" ఉండబట్టలేక అడిగివేసింది సీతమ్మ.

"చెబుతా కానీ, జ్యోతి ఏదీ" అని అడిగాడు జగన్నాధం.

"ఏం, గుళ్ళోకివెళ్ళింది" అంది సీతమ్మ. జరిగినదంతా చెప్పేశాడు జగన్నాధం.

"అవును. రమణయ్య చక్కగా చెప్పాడు; అలాచేస్తే ఏ బాధలు ఉండవు" అంది సంతోషంగా సీతమ్మ.

"ఏమిటే నీ వనేదీ? పాపం జ్యోతి సంగతి ఆలోచించావా? డబ్బుకోసం బిడ్డను అమ్ముకుంటామా?" అన్నాడు కోపంతో జగన్నాధం.

"బిడ్డను అమ్ముకోవటమేమిటి? పిచ్చివారు కాకపోతే ఏమిటా మాటలు? కట్నాలు ఈనాడే ఉన్నవి కావు. ఏనాటినుంచో ఉన్నాయి. మీరుమాత్రం అప్పట్లో కొద్దో గొప్పో కట్నంతీసుకోలేదా? మీరూ అమ్ముడుపోయినట్లేనా? రమణయ్య అన్నట్లు జ్యోతికికూడా యింకో సంబంధం చూసి పెళ్ళిచేసేద్దాం" అంది సీతమ్మ.

"మధు ఈ పెళ్ళికి యిష్టపడడు జ్యోతి కెంత ద్రోహంచేస్తున్నామో ఆలోచించు" అన్నాడు జగన్నాధం.

"సిరి రా మోకాలడ్డు వారెవరండీ? మీరు ఊరుకోండి. నేను నచ్చచెప్తాను వాడికి నా మాటకు ఎదురుచెప్పలేడు వాడు. రెండు రోజులు బాధపడతాడు. ఊరుకుంటాడు. లేదా? నేనీ భయంకర రోగంతో జీవించడం కంటె ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటే మేలు. చేతికందిన అదృష్టాన్ని జారవిడువకూడదు. మీ రేమీ కలుగచేసుకోకండి" అంది నిశ్చలంగా సీతమ్మ.

జగన్నాధం ఏమీ మాట్లాడలేకపోయాడు. ఒక అమాయకురాలి ప్రేమను కూకటి వ్రేళ్ళతో పెల్లగించివేస్తున్నానే అని లోలోపల కుమిలి, కుమిలి ఏడ్చాడు.





బయటనుంచి యిదంతా వింది జ్యోతి.

ఆమె గుండెలలో శతఘ్నులు ప్రేలాయి.

తనవల్ల ఎంతమంది బాధపడుతున్నారు? తనుంటే వాళ్ళకు ఏం లాభం, నిజమే బావ కేంలోటు? బోలెడు కట్నం వస్తుంది.

బావ ఈమధ్య మారిపోయాడు కూడా. తను వాళ్ళకు బాధ కలుగచేస్తోందేమో. తను తొలగిపోవాలి. తను లేకపోతే వాళ్ళెంతో సుఖపడతారు. కాని తను ఎక్కడకు వెడుతుంది? యౌవనంలో వున్న తనను ఈపాడు ప్రపంచం బ్రతకనిస్తుందా?

● ● ●

ప్రకృతి ప్రళయతాండవ మాడుతోందా అన్నట్లు భీకరమయిన తుఫాను. అమావాస్య చీకటి నలుదెసల క్రమ్ముకొంది. వాతావరణం భయంకరంగా ఉంది.

డాక్టర్ రమేష్ పొరుగూరులో స్నేహితుని పెళ్ళిచూసి తిరిగి తన ఊరు వెడుతున్నాడు. ఏ చెట్టు అయినా విరిగి దారికి అడ్డంగా పడుతుందేమో ననే భయంవల్ల వేగంగా తోలుతున్నాడు కారు. కళ్ళు మిరిమిట్లుగొలిపేలా ఒక్క మెరుపుమెరిసింది. ఆ మెరుపులో ఒక దృశ్యం రమేష్ కంట పడింది. అతని ఒళ్ళు జలదరించింది. దూరాన రైలుకూత పెట్టింది.

రైలుపట్టాలకు అడ్డంగా ఎవరో పడి ఉన్నారు. పరుగెత్తాడు. ఆ వ్యక్తిని భుజాల మీద వేసుకున్నాడో లేదో గూడ్సు బండి వెళ్ళిపోయింది.

అమ్మయ్య అనుకున్నాడు రమేష్. అతని గుండెదడ కొంచెం తగ్గింది. ఆమె ముక్కు వద్ద చేయిపెట్టాడు. శ్వాస ఆడుతోంది. పర్వాలేదు స్పృహ తప్పింది. అంతే అనుకుని తృప్తిపడ్డాడు.

● ● ●

జ్యోతి నెమ్మదిగా కళ్ళుతెరచింది. తను ఎక్కడుంది? నలుప్రక్కలా చూచింది.

"ఏవమ్మా ఎలాగుంది" అంటూ ఆప్యాయంగా తల నిమురుతున్న ఆమె కేసి చూచింది జ్యోతి.

"కాఫీ తీసుకోండి" అంటూ అందించాడు రమేష్. "నన్నెందుకు బ్రతికించారు?" అంది ఏడుస్తూ జ్యోతి.

"పిచ్చిపిల్లా. ఆత్మహత్య మహాపాతకం. అయినా చావు బ్రతుకులు మనచేతిలో లేవమ్మా! అంతా ఈశ్వరేచ్ఛ నీవిక్కడ సుఖంగా ఉండచ్చు" అంది ఆవిడ, రమేష్ తల్లి అహల్యాబాయి

● ● ●

అహల్య ప్రేమ తల్లిప్రేమనే మరపిస్తోంది. వాళ్ళు చాలా భాగ్యవంతులనీ, రమేష్ పేరుమోసిన డాక్టరనీ బీదలకు ఉచితంగా వైద్యం చేస్తాడనీ, అందరిమంచి సంపాదించుకున్నాడని తెలుసుకుంది జ్యోతి.

అహల్య జ్యోతిని ఎంతో ప్రేమగా చూచుకొంటోంది. ఆమె వద్దన్నా వినక జ్యోతి ఆపనీ, యీపనీ కల్పించుకు చేసేది.

---

● ఒకడు: "నేను రోజుకు రెండుసార్లు గీస్తాను. మీరు?"

రెండోవాడు: "నలభై యాభైసార్లు."

మొదటివాడు: "అయ్యబాబోయ్. ఎందుకు?"

రెండోవాడు: "నేను మంగలిని."

రమేష్ దిగులుగా ఉంటాడు. ఏదో చెప్ప లేని బాధ ననుభవిస్తున్నట్లు ఉంటాడు. అహల్యకూడా అప్పుడప్పుడు ఏదో బాధ పడుతుండేది. జ్యోతి తెలుసుకుందామని ఎన్నోసార్లు ప్రయత్నంచేసేది కాని. తాను వారి కుటుంబ విషయాలపట్ల ఆసక్తి చూపడం ఉచితం కాదనుకుని ఊరుకునేది.

రమేష్ అంటే జ్యోతి కెంతో గౌరవ భావం కలిగింది. అతను తనంటే దూరంగా తొలుగుతాడు. వెకిలివేషాలు వేయడు. ఈ రోజుల్లో ఇలాంటి వారుండటం అరుదు అనుకుంది జ్యోతి తనను గురించి వారేమీ అడగలేదు. తనను అక్కడే ఉండమని అహల్య పట్టుపట్టింది. తానుమాత్రం ఎక్కడకు వెళ్తుంది? అక్కడే ఉండి పోయింది జ్యోతి.

ఆరుమాసాలు గడచిపోయాయి.

"అమ్మా ఇంకా అట్లాగే కూర్చొన్నారే!" పూజవేళవలేదూ? పూజకు అన్నీ సిద్ధం చేశానమ్మా" అంది జ్యోతి అహల్యతో.

"ఎందుకమ్మా పూజలు? ఎన్నిచేసినా ఏముంది ఫలితం?" అంది నిట్టూరుస్తూ అహల్య.

"ఒకరి బాధలు మరొకరికి చెప్పుకుంటే హృదయం తేలికవుతుంది. మీ బాధ ఏమిటో చెప్పండమ్మా" అని అడిగింది జ్యోతి.

"నాకు ఒక మేనకోడ లుండేది. పేరు నిర్మల. తెలివయినది. అందమయినది. దురదృష్టవంతురాలు. చిన్ననాడే తల్లిదండ్రు లను పోగొట్టుకుంది. నా దగ్గరే పెరిగేది. నిర్మల, రమేష్ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు.

డాక్టరు చదువుకు అబ్బాయి పట్నం వెళ్ళి పోయాడు. మూడు సంవత్సరాలు గడిచాయి.

అబ్బాయి పెళ్ళి చేసేద్దామనుకున్నాను కాని అబ్బాయి రమేష్ ఆఖరుసంవత్సరంలో చేసుకుంటాను. అప్పటికి నాచదువు పూర్తి అవుతుంది అన్నాడు

భగవంతుడు ఓర్వలేకపోయాడు.

హఠాత్తుగా జబ్బుచేసి నిర్మల శాశ్వతంగా కన్ను మూసింది. అబ్బాయి ఆమె శవాన్ని కూడా చూడలేదు. రమేష్ వచ్చేటప్పటికే ఆమె బూడిదయిపోయింది." అహల్య కళ్ల తుడుచుకుంది.

"అప్పట్నుంచి రమేష్ అదోలా అయి పోయాడు.

ఎన్నిసార్లో చెప్పాను పెళ్ళిచేసుకోమని. కాని వాడు యిష్టపడటంలేదు. మహాలక్ష్మి లా నట్టింట్లో కోడలు మసులుతుందనీ. మనుమల అల్లరి చూడాలని అందరిలాగా నాకూ కోరిక ఉంటుంది. ఎప్పటికయినా భగవంతుడు తీరుస్తాడో? లేదో?

విచిత్రం ఏమిటంటే మా నిర్మల నీలాగే ఉంటుంది.

నిర్మల పోలికలు నీలో చాలావున్నాయి అన్నాడు రమేష్ రెండు. మూడుసార్లు" అంది అహల్య.

జ్యోతికూడా తన సంగతి చెప్పివేసింది.

"ఇన్నాళ్ళు నీవు చెప్పనూలేదు నేను అడగనూలేదు. 30, 40 వేలు నాకు లెక్క లోనివి కావు. ఓ ఆడపిల్లకు పెళ్ళి చేశాను గదా అని సంతోషిస్తాను. చెప్పమ్మా మీ యింటి అడ్రసు. మీ మామయ్యపేరు. వెళ్ళి అక్కడ పరిస్థితులు తెలుసుకు వస్తా" అంది అహల్య.

ఆమె విశాల హృదయానికి మనసులోనే జోహారు లర్పించింది.

"వద్దమ్మా. జరుగవలసినది జరిగిపో యింది" అంది జ్యోతి.





"అంటే? అప్పుడే వివాహం జరిగి ఉండవచ్చనని నా నీ ఊహ?" అంది అహల్య.

"వివాహం అయిపోయిందమ్మా. మూడు నెలలక్రిందట నేను వాళ్ళ పెళ్ళి ఫోటో పేపర్లో చూశాను.

"పోనీలెండమ్మా వారి కష్టాలు గట్టె క్కాయి. నా కదే ఆనందం" అంది జ్యోతి.

"అమ్మా జ్యోతి నీవేమి అనుకోకుండా ఉంటే ఒక్కమాట చెపుతా వింటావా? అంది అహల్య.

"చెప్పండమ్మా. మీ కన్నా నా కెవరు న్నారు ఈ లోకంలో. చనిపోతున్నదానిని రక్షించారు. ఆదరించారు. చెప్పండమ్మా" అంది జ్యోతి.

"జ్యోతీ!"

రమేష్ బాధను నీవైనా తొలగించడానికి ప్రయత్నం చేస్తావని ఆశిస్తున్నాను. శూన్య మైన ఈ యింటిలో నువ్వు జ్యోతివయి ప్రకాశించు. ఇంతకన్నా నేనేమి చెప్ప గలను? అంది అహల్య.

"తప్పక ప్రయత్నిస్తానమ్మా కాని నేను పేదదాన్ని" అంది జ్యోతి.

● ● ●

పౌర్ణమిచంద్రుడు పదహారు కళలతో ప్రకాశిస్తున్నాడు. విరియబోసిన విరజాజులు, నైట్‌క్వీను పరిమళాలను వెదజల్లుతున్నాయి. రేడియోలో ఏదో పాట మధురంగా విని స్తోంది. రమేష్ గదిలోనికి పాలగ్లాసుతో వచ్చింది జ్యోతి.

"పాలు తీసుకోండి"....

జ్యోతి మాటవిని పుస్తకం చదువుతున్న రమేష్ తలయెత్తి ఆశ్చర్యంగా చూశాడు

జ్యోతి తనతో ఎప్పుడూ మాట్లాడలేదు. పాలుపెట్టేసి వెళ్ళిపోతూ ఉండేది. జ్యోతి యింకా అక్కడే నిలబడడం చూసి ఆశ్చర్య పోయాడు రమేష్.

"నిలబడ్డారేం. కూర్చోండి" అన్నాడు రమేష్. ఏమని చెప్పేది? ఎట్లా మాట్లాడేది, అనుకుని తికమకపడింది జ్యోతి. ఆఖరికి సాహసించి.

వెలువడింది!    సరికొత్త ప్రచురణ!

## రసికజన మనోభిరామము

అను

## $N_2O$

జ్యోతి జోక్స్‌వారి హాస్యరస ప్రధానమైన ప్రబంధరాజం కొత్తగా వెలువడింది. ఆహ్లాదకరమైన ముఖచిత్రంతో, పుటపుటకు నవ్వించే కార్టూన్లూ, ఛలోక్తులతో రసిక పాఠకజన మనోభిరామంగా ప్రచురింపబడిన ఈ పుస్తకం అందరు తప్పక చదవదగినది.

నేడే మీ ప్రతికి ఆర్డరివ్వండి. లేదా "జ్యోతి" ఏజెంట్స్ ద్వారా తెప్పించుకోండి.

వెల : రూపాయి.    పోస్టేజితోసహా రూ. 1-68.

ప్రతులకు : జ్యోతి బుక్స్, విజయవాడ-2.


"చనువు తీసుకుని అంటున్నందుకు మీరు ఏమీ అనుకోవద్దు. పెద్దావిడ, అమ్మగారి కోరిక తీర్చండి. మీరు వివాహం చేసుకోండి" అంది జ్యోతి.

నవ్వి అన్నాడు రమేష్ "మీకు అమ్మ, నిర్మల విషయం చెప్పిఉండవచ్చు. నిర్మల పోలికలు ఉన్న యువతి నాకు కనుపించటం లేదు."

"నిర్మల పోలికగల అమ్మాయిఉంటే వివాహం చేసుకుంటారా" అని అడిగింది జ్యోతి.

"తప్పక చేసుకుంటా కాని, ఆ అమ్మాయికి నేను నచ్చవద్దూ" అన్నాడు నవ్వుతూ రమేష్.

జ్యోతి మాట్లాడలేదు. చిరునవ్వు నవ్వింది.

"మీ సంగతి నాకు అమ్మ చెప్పింది మీరు యిక్కడకు వచ్చిన వెంటనే చెప్పివేస్తే అమ్మ తప్పక మీ బావగారితో మీ వివాహం జరిపించిఉండేది" అన్నాడు రమేష్

"అవన్నీ మరచిపోవటం మంచిది. ఆ జన్మ వేరు, నాకు మీరు పునర్జన్మ ప్రసాదించారు" అంది జ్యోతి తలవంచుకొని.

"మీలో నిర్మల పోలికలు చాలా ఉన్నాయి. అమ్మతోగూడా రెండుసార్లు అన్నాను. మిమ్మల్ని చూస్తే నిర్మలను చూసినట్లుగా ఉంటుంది" అన్నాడు బాధగా నిట్టూర్చి.

"నిర్మలలేని స్థానంలో నన్ను నియమిస్తారా ?" అడిగింది జ్యోతి.

"జ్యోతీ...." అన్నాడు రమేష్, ఆనందంగా.

"అవును, నిర్మలలేని లోటు తీర్చటానికి ప్రయత్నిస్తా" అంది జ్యోతి.

"జ్యోతీ, నీవుమాయింటికి వచ్చినప్పుడు నిర్మల తిరిగి వచ్చిందా అనుకుని ఆనందించాను. నీతో ఎన్నో సార్లు చెబుదామనుకున్నాను కాని చెప్పలేకపోయాను.

భగవంతుడే నిర్మల రూపంలో నిన్ను నాదగ్గరకు పంపాడేమో" అని ఆనందంతో ఆమెను దగ్గరగా తీసుకున్నాడు.

రమేష్ పాదాలను కళ్ళకద్దుకుని నమస్కారం చేసింది జ్యోతి. ▢▢▢

# అతనికంటె ఘనుడు

వాళ్ళిద్దరికీమధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందని ఆబాల గోపాలానికి తెలుసును. అయితే నిజంగా పచ్చగడ్డి తీసుకువెళ్ళి వాళ్ళిద్దరిమధ్యన వేసి, అప్పుడు వచ్చినమంటని చూశామని చెప్పిన వాళ్ళెవరూ లేరు. కాని, మంట వచ్చి తీరుతుందని మాత్రం నిస్సందేహంగా యావన్మందీ చెప్తారు.

